
సాక్షి చిత్తూరు

సోమవారం । 18 । నవంబర్ । 2024



బోయకొండలో భక్తుల రద్దీ

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. - 8లో



స్నాచింగ్ ముఠాలకు సంకెళ్లు

మహిళల మెడలో నుంచి అలవోకగా ఆభరణాలు లాక్కెళ్లే రెండు ముఠాలకు పోలీసులు సంకెళ్లు వేశారు. - 8లో



రామా.. నీ గోడు వినేదెవరు?

భూమి కోసం పట్టుబడుతున్న అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య ముద్దురామాపురం నలిగిపోతోంది. - 8లో

న్యూస్‌రీల్

కిక్కిరిసిన కాణిపాకం



భక్తులతో కిక్కిరిసిన క్యూలు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంచి ముహూర్తాలు ఉండడంతో భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. దీంతో ఆలయంలోని క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేశారు. గర్భిణులకు, దివ్యాంగులకు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా సమస్యలు ఏవైనా ఉంటే ఆధార్ కార్డుతో వచ్చి, తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.

వచ్చే ఏడాది మేలోపు కుప్పానికి కృష్ణా జలాలు

పలమనేరు: వచ్చే ఏడాది మేలోపు కృష్ణా జలాలు కుప్పానికి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హంద్రీనీవా కార్యనిర్వాహణ ఇంజినీరు (కుప్పం బ్రాంచి కెనాల్) రాజగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న 'సాక్షి'లో ప్రచురితమైన హంద్రీనీవా పనులు సాగేనా అనే కథనానికి ఆయన స్పందించారు. కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి తీసుకురావడానికి పెండింగ్‌లోని పనులను వచ్చే ఏడాది మేలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అక్కడక్కడ లైనింగ్, కాంక్రీట్ కట్టడాలు శరవేగంగా జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

వీవోఏలపై పాశుపతాస్త్రం

- జిల్లాలో 190 మంది తొలగింపు
- కొనసాగుతున్న వేధింపులు
- తొలగింపులకు టీడీపీ నేతల సిఫార్సు లేఖలు
- డీఆర్‌డీఏ అధికారులపై కూటమి ఒత్తిడి

చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వీవోఏల తొలగింపులు కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం తన ప్రతాపాన్ని చూపుతోంది. అధికంగా సీఎం నియోజకవర్గమైన కుప్పంలో, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో తొలగింపులు కొనసాగుతున్నాయి. వీవోఏలను తొలగించాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అధికారులకు సిఫార్సు లేఖలు ఇచ్చి, ఒత్తిడి తీసుకురావడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇతర నియోజకవర్గాల్లో సైతం కూటమి ప్రజా ప్రతినిధులు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) అధికారులకు సిఫార్సు లేఖలు ఇచ్చి ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు 190 మంది వరకు వీవోఏలను తొలగించారని సమాచారం.



వీవోఏలను తొలగించాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అధికారులకు ఇచ్చిన సిఫార్సు లేఖ



వీవోఏల అక్రమ తొలగింపులకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు (ఫైల్)



కొత్త ప్రభుత్వం వచ్చింది.. మంచి ప్రభుత్వమని ప్రచారం చేస్తూనే ముంచేస్తోంది. తల్లికి వందనం, మత్స్యకార భృతి, రైతన్నకు పెట్టుబడి సాయం వంటి ప్రజాసంక్షేమ పథకాలను అటకెక్కించేసింది. దాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోంది. చిరుద్యోగులను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. దీనిపై నిరసన వెల్లువెత్తుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణం ధర్నాలతో దద్దరిల్లుతోంది. ఆదుకోవాలంటూ అధికారులకు పెద్దఎత్తున అర్జీలు అందుతున్నాయి. కూటమి సర్కార్ వేధింపులు, తొలగింపులకు గురైన గ్రామ సమాఖ్య సహాయకు(వీవోఏ)ల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నేతల ఒత్తిడితో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న చిరుద్యోగులను నిర్దయగా తొలగిస్తున్నారు. టీడీపీ నేతలకు ఆ పోస్టులు ఇప్పించుకునేందుకు కుట్రలు చేస్తూ వెలుగు, డీఆర్‌డీఏ అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ముందు అమలు సాధ్యంకాని అనేక హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన టీడీపీ నాయకులు.. తీరా అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రజలతో పాటు చిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా దాన్నే నమ్ముకున్న వారి కుటుంబాలను నడిరోడ్డున పడేస్తున్నారు. ఆ బాధితుల జాబితాలో గ్రామ సమాఖ్య సహాయకు (వీవోఏ)లు చేరారు. వారి పొట్టకొట్టి తమ అనుచరులు, తమకు కావాల్సినవారిని ఆ పోస్టుల్లో కూర్చోబెట్టడానికి టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల అండతో చెలరేగిపోతున్నారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వీవోఏలను తొలగించాలని అధికారులకు సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. సంబంధిత వీవోఏలను తొలగించకపోతే వేరే చోటుకు బదిలీ చేయిస్తామంటూ వెలుగు అధికారులను బెదిరిస్తున్నారు. జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, నగరి నియోజకవర్గాల్లో ఇదే తంతు కొనసాగుతోంది.

గ్రామ స్థాయిలో కీలక బాధ్యతలు

గ్రామ స్థాయిలో పది నుంచి 20 డ్వాక్రా సంఘాల సమూహంగా ఉండే ప్రతి గ్రామ సమాఖ్యకు ఒక వీవోఏ ఉంటారు. వీరికి నెలకు రూ.8వేలు చొప్పున గౌరవ వేతనం వస్తుంది. ఇప్పుడీ ప్రభుత్వం ఆ మొత్తాన్నీ నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. గ్రామ సమాఖ్య ఖాతాల్లో జమచేస్తే ఆ సమాఖ్య అధ్యక్షులు వారికి చెల్లిస్తారు. ఎప్పుడైనా ఆ వీవోఏను తొలగించాలంటే ఆ సమాఖ్యలే తీర్మానం చేయాలి. వీటికి స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉన్నప్పటికీ సభ్యులుగా ఉన్న పింఛనుదారులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు టీడీపీ నాయకుల హెచ్చరికలకు భయపడుతున్నారు. వారిని ఎదిరిస్తే ఎక్కడ తమకు పథకాలు అందవోనన్న భయంతో వారి చెప్పినదానికల్లా తలూపుతున్నారు. దీంతో పలుచోట్ల వీవోఏలను తొలగించడానికి తీర్మానాలు చేసేస్తున్నారు.

కొత్త వాళ్లు మాకొద్దు

టీడీపీ నేతలు తమకు అనుకూలంగా ఉన్న వారిని వీవోఏలుగా నియమించుకుంటున్నారు. అయితే వారి వల్ల పనులు చేయించుకోవడం తమ వల్ల కాదని మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఏపీఎంలు ప్రజాప్రతినిధులకు తేల్చి చెబుతున్నారు. అనుభవం లేని వారిని వీవోఏలుగా పెట్టుకోవడం వల్ల కార్యక్రమాలు ముందుకు సాగవని చెబుతున్నారు. అయినప్పటికీ వారి మాటలను వినకుండా టీడీపీ నేతలు తమ పార్టీ కార్యకర్తలకు ఆ పోస్టులను కట్టబెడుతున్నారు. వీవోఏలను తొలగించే అధికారం అధికారులకు లేవన్న నిబంధనలున్నాయి. అదే విధంగా తమకు న్యాయం చేయాలంటూ వీవోఏలు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ ప్రక్రియ తమకు అనుకూలంగా జరిగేలా వెలుగు అధికారులనూ టీడీపీ నాయకులు బెదిరించడం గమనార్హం. కొన్నిచోట్ల తీర్మానాలు లేకుండానే మండల ఏపీఎంలపై ఒత్తిడి పెంచి వీవోఏలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ ధోరణి తగదు



“ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులపై ప్రతాపాన్ని చూపిస్తోంది. పాలకు తమ ధోరణి మార్చుకోవాలి. జిల్లాలో రాజకీయాలకు సంబంధం లేని చిరుద్యోగులైన వీవోఏలను తొలగించడం వల్ల ఏమి ఒరుగుతుంది? తొలగింపునకు గురైన వీవోఏలకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద ఇటీవల ధర్నా చేశాం. వారికి న్యాయం చేసేంత వరకు పోరాడతాం.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, చిత్తూరు జిల్లా

వారిని రోడ్డున పడేశారు



చాలా సంవత్సరాలుగా వీవోఏ ఉద్యోగాన్ని నమ్ముకుని పనిచేస్తున్న వారిని ఈ సర్కారు రోడ్డున పడేయడం అన్యాయం. చిరుద్యోగులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు పడే బాధలు వర్ణనాతీతం. ప్రజలకు మంచి చేయక పోగా, వారిని ఇలా వీధిన పడేసి వేధించడం దారుణం. వీవోఏల పొట్టగొట్టడం ఎంత వరకు న్యాయం. జిల్లాలో తొలగించిన వీవోఏలకు ఖచ్చితంగా న్యాయం చేయాలి.

– రాజశేఖర్, వీవోఏల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, చిత్తూరు

వార్డు సభ్యుడే ఫీల్డ్ అసిస్టెంట్

- అదనంగా దివ్యాంగ పింఛను
- ప్రజాప్రతినిధికి ఉద్యోగం కట్టబెట్టిన కూటమి సర్కారు



రెడ్డెప్ప

గంగవరం: ఆయనొక వార్డు మెంబర్.. పింఛనుదారు.. తాజాగా ఫీల్డ్ అసిస్టెంట్.. ఇదే కూటమి సర్కారు తతంగం. మండలంలోని కొత్తపల్లెకు చెందిన రెడ్డెప్ప ఇదే పంచాయతీ 1వ వార్డు సభ్యుడిగా గెలుపొందాడు. ప్రభుత్వం ఈయనకు ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ (ప్రభుత్వ)ఉద్యోగాన్ని తాజాగా కట్టబెట్టింది. ఎవరైనా ప్రజాప్రతినిధిగా కొనసాగుతుంటే ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులు. అయితే కూటమి ప్రభుత్వానికి ఇలాంటి నిబంధనలు పట్టవు. అందుకనే ఏకంగా తమ పార్టీ వార్డు మెంబర్‌కి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని ఇచ్చేసింది. ప్రభుత్వం మారగానే గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను బలవంతంగా తొలగించి అతని స్థానంలో ఈయన్ను అధికారులు నియమించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా అతన్ని నియమిస్తూ ఉపాధి హామీ పథకం జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు సైతం వచ్చినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా అతనికి పదేళ్లుగా దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఈ విషయమై ఎంపీడీఓ సురేష్‌బాబును సంప్రదించగా, అతను వార్డు మెంబర్ అనే విషయం తనకు తెలియదని చెప్పారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

19న చిత్తూరుకు బైక్ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్, బెంగళూరుకు చెందిన అధికారులు చేపట్టిన బైక్ ర్యాలీ ఈ నెల 19న చిత్తూరు జిల్లా కేంద్రానికి చేరుకోనున్నట్లు ర్యాలీ ఇన్‌చార్జి వరదరాజులు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ర్యాలీ షెడ్యూల్ ప్రకారం అన్ని ప్రాంతాల్లోకి వెళుతుందన్నారు. మాజీ సైనికుల సమస్యలను విచారించి పరిష్కరిస్తారని తెలిపారు. బైక్ ర్యాలీ ఈ నెల 19వ తేదీ చిత్తూరు జిల్లా కేంద్రంలోని పోలీస్ మైదానానికి విచ్చేస్తుందన్నారు. జిల్లా లోని మాజీ సైనికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 9885981451ను సంప్రదించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

- తీవ్ర ఒత్తిడి, అవమానాలకు గురవుతున్న ఉద్యోగులు
- పింఛన్ల పంపిణీతో మొదలై, పాఠశాలల మరుగుదొడ్ల వరకు
- ఇంటింటికీ స్టిక్కర్లు, కరపత్రాల పంపిణీ
- తాజాగా ఇంటింటికీ జియో ట్యాగింగ్ సర్వే



పశుగణన సర్వేలో సచివాలయ సిబ్బంది, అధికారులు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. రోజురోజుకూ చిన్నచూపు చూస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన విధులన్నింటినీ ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ ప్రతిరోజూ వారిని రోడ్ల వెంట తిప్పుతోంది. గత ప్రభుత్వంలో ఇంటింటికీ తిరిగి సేవలందించేందుకు వలంటీర్లు ఉండే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వలంటీర్లు ఉంటారని, జీతాలు కూడా పెంచుతామని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు ఆ హామీని గాలికొదిలేశారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా వలంటీర్ల విధులన్నింటినీ సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు.

పూతలపట్టు నియోజకవర్గంలో 1,134 గ్రామాలు, 78,254 కుటుంబాలు ఉన్నాయి. వీటి పరిపాలన సౌలభ్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లె పాలనకు పెద్ద పీట వేస్తూ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. జనాభా ప్రాతిపదికన నియోజకర్గంలో 97 సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ నిమిత్తం 1,138 మంది సిబ్బందిని కేటాయించింది. గతంలో వీరు కార్యాలయంలో ఉంటూ వలంటీర్ల ద్వారా అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేసేవారు. ఇప్పుడు ఆ సర్వేలన్నీ వారి నెత్తిన పడ్డాయి.

సొంత పనులకు టాటా...

శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు మందగిస్తున్నాయి. సొంత పనులు వదిలి అందరూ జియో ట్యాగింగ్ సర్వేకు పరిమితమయ్యారు. ముఖ్యంగా పశుసంవర్ధకశాఖ సిబ్బందికి పశుగణన సర్వేను చేయాల్సి ఉండగా, వారు ఆ సర్వేను పక్కన పెట్టారు. జియో ట్యాగింగ్ సర్వేకు పరిమితమయ్యారు. ఇక పాడి ఆవులకు వైద్య సేవలు అందడం లేదు. పాడి ఆవులకు జబ్బు చేస్తే వారిని వెతుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ సేవలు పూర్తిగా స్తంభించాయి. కుల, ఆదాయ ఇతరత్రా సేవల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. వెల్ఫేర్ సిబ్బంది పింఛన్ల సర్వే చేయాల్సి ఉండగా అవి కూడా నత్తనడకన నడుస్తున్నాయి. కేటాయించిన సర్వే పనులను చేయని పక్షంలో జీతాల్లో కోతలు పెడుతామని, షోకాజు నోటీసులు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు.

జియో ట్యాగింగ్‌తో తీవ్ర ఇబ్బందులు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ జియో ట్యాగింగ్ సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎంప్లాయీస్ మొబైల్ అప్లికేషన్ పేరిట వచ్చిన యాప్‌లో ప్రతి ఇంటినీ ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆధార్ నంబర్ అప్ లోడ్ చేయాలి. ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా టార్గెట్లు ఇచ్చారు. సర్వే సమయంలో గృహ యజమాని తప్పనిసరిగా బయోమెట్రిక్ లేదా ఫేసియల్ అథెంటికేషన్ ఇవ్వాలి. దీనిపై ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జియో ట్యాగింగ్ సర్వేకు ప్రజలెవరూ సహకరించడం లేదు. దీనికి తోడు కొన్నిసార్లు నెట్‌వర్క్ పనిచేయక, సిగ్నల్స్ అందక యాప్ ఓపెన్ కావడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బయోమెట్రిక్ హాజరు పేరుతో వేతనాల్లో కత్తెర వేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న తమపై ఎందుకీ వివక్ష అంటూ మనోవేదన చెందుతున్నారు.

ఇదీ టార్గెట్

ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, అవమానాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే తొలుత పింఛన్ల పంపిణీని సచివాలయ ఉద్యోగులతో చేయించారు. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై రోజు మార్చి రోజు పరిశీలన చేసి ఫొటోలు యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని అప్పగించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేయించారు. తాజాగా మళ్లీ ఇంటింటికీ తిప్పి జియో ట్యాగింగ్ సర్వే చేయిస్తున్నారు. జియో ట్యాగింగ్ సర్వేలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వినిపించుకోవడం లేదు. తప్పకుండా చేయాల్సిందే అంటూ ప్రభుత్వం వేధిస్తుండడంతో సచివాలయ ఉద్యోగులు నలిగిపోతున్నారు. టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో మనోవేదనకు గురవుతున్నారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపి సచివాలయ ఉద్యోగులుగా ఎంపికై న తమతో ఇలాంటి పనులు చేయించడం ఏంటని ఆవేదన చెందుతున్నారు. కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందడమే తాము చేసిన పాపమా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే కూటమి ప్రభుత్వం తమను చిన్న చూపు చూస్తూ కక్ష సాధిస్తోందని, ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చామా అని బాధపడుతున్నారు.

రామ్మూర్తి నాయుడికి కన్నీటి వీడ్కోలు



రామ్మూర్తి నాయుడికి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులు

చంద్రగిరి: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు అంతిమ సంస్కారం కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల మధ్య సాగింది. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కన్నీటి సంద్రం నడుమ ఆయనకు వీడ్కోలు పలికారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నారా రామ్మూర్తి నాయుడు(71) తుది శ్వాస విడిచారు. ఆదివారం ఉదయం ఆస్పత్రి నుంచి ప్రత్యేక విమానంలో ఆయన పార్థివదేహాన్ని మంత్రి నారా లోకేష్, కుటుంబ సభ్యులు రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నారావారిపల్లెకు తరలించి, తన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఉదయం 11.20 గంటలకు సీఎం చంద్రబాబు నారావారిపల్లికి చేరుకున్నారు. తన తమ్ముడు మృతి చెందడంతో తీవ్ర దిగ్భ్రాంతికిలోనైన సీఎం తన కుటుంబ సభ్యులతో కలసి నివాళులర్పించారు.

పలువురు ప్రముఖుల నివాళి

మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకు ఆదివారం తన స్వగృహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఇందులో మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, ప్రముఖ నటులు మంచు మోహన్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, శ్రీవిష్ణు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మాజీ టీటీడీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు దేవినేని ఉమ, కలికిరి మురళీమోహన్, పులివర్తి నాని, అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్, చింతమనేని ప్రభాకర్, కురుగొండ్ల రామకృష్ణ, ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రామ్మూర్తి నాయుడుకు ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటి వద్ద నుంచి అంతిమయాత్రను ప్రారంభించారు. గ్రామ సమీపంలోని తల్లిదండ్రుల సమాధుల వద్ద మామిడి తోటలో దహనానికి ఏర్పాటు చేసిన ప్రాంతానికి తీసుకొచ్చారు. హిందూ సంప్రదాయ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన తనయుడు, హీరో నారా రోహిత్ తన తండ్రికి అంతిమ సంస్కారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి, రామ్మూర్తినాయుడుకు ఘన నివాళులర్పించారు. రేపు ఉదయం సీఎం చంద్రబాబు నారావారిపల్లె నుంచి తిరిగి వెళ్లనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.



దహన సంస్కారాల్లో తనయుడు రోహిత్

క్లుప్తంగా

బోయకొండలో భక్తుల రద్దీ



చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం వేలాదిగా తరలివచ్చారు. బోయకొండ ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఒక్క రోజే సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వేదపండితులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మ వారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

2 నుంచి దివ్యాంగుల క్రీడాపోటీలు

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ పారా సిట్టింగ్ వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 2, 3 తేదీల్లో దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–ర్డినేటర్ నాగరాజు తెలిపారు. పోటీలను తుని జిల్లాలోని పాయకరావుపేటలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ఆసక్తి గల దివ్యాంగులు పాల్గొనవచ్చని, పాల్గొనే జట్లు తమ వివరాలను ముందుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం 9985882559, 9985568249 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

టెంపో ఢీకొని వృద్ధుడి మృతి

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం టెంపో ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. దళితవాడకు చెందిన ఆబేలు(77) రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న టెంపో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధుడిని స్థానికులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రామా .. నీ గోడు వినేదెవరు?

ఆ గ్రామం అటవీ, రెవెన్యూ శాఖల మధ్య నలిగిపోతోంది. ఆ భూమి తమదంటే తమదని అధికారులు వాదిస్తున్నారు. 1856 నుంచి మా స్వాధీనంలో ఉందని అటవీ అధికారులు చెబితే, 1922 నుంచి మా రికార్డుల్లో ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా స్థలంలోనే గ్రామస్తులందరూ ఇళ్లు నిర్మించుకున్నారు. వారందరికీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు మాత్రం యథావిధిగా సాగిపోతున్నాయి. ప్రభుత్వ నిర్మాణాలను, పథకాలను అడ్డుకోని అధికారులు గ్రామస్తులు మట్టి తీసినా, గొయ్యి తవ్వినా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు మారిపోతున్నా ఈ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కనీసం జిల్లా కలెక్టరైనా స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- అటవీ, రెవెన్యూ మధ్యలో ముద్దురామాపురం
- 1856 నుంచి ఆ భూమి మాదే : అటవీ శాఖ
- 1922 నుంచి మా రికార్డుల్లోనే : రెవెన్యూ శాఖ
- భూమి కోసం ఇరు శాఖల పట్టు



ముద్దురామాపురం గ్రామం



గ్రామంలోని సీసీ రోడ్డు

పూతలపట్టు : సుమారు ఐదు దశాబ్దాల క్రితం వెలసిన గ్రామంలో ఉండే వంద కుటుంబాల వారికి అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఆ భూమి మాదంటే మాదేనని ఇరు శాఖల అధికారులు గట్టిగా వాదిస్తున్నారు. గ్రామస్తుల కథనం మేరకు, యాదమరి మండలం సిద్దారెడ్డిపల్లె పంచాయతీ ముద్దురామాపురంలో 100కు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ గ్రామం మధ్యలో తారురోడ్డు ఎడమ వైపునున్న 105 ఎకరాల కోసం అటవీ, రెవెన్యూ అధికారులు పోటీపడుతున్నారు. సర్వే నంబర్‌లో 135లో ఉన్న 150 ఎకరాలు గయ్యాలి పోరంబోకు అని రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దీంతో భూమిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, సబ్‌స్టేషన్, తాగునీటి ట్యాంక్, సీసీ రోడ్డు అన్నీ నిర్మించారు. వీటితో పాటు 70 నివాసాలు కూడా ఉన్నాయి. సుమారు 50 ఏళ్లుగా వీరు అక్కడ నివశిస్తున్నారు. ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను ఆ గ్రామానికి అందజేసింది.

గ్రామంలో ప్రభుత్వ నిర్మాణాలు

ముద్దురామాపురంలో నివసిస్తున్న దళిత కుటుంబాలకు 1983లో ఇందిరమ్మ పథకం కింద ఇంటి పట్టాలను ప్రభుత్వం అందజేసింది. గత ప్రభుత్వంలో ఆ గ్రామానికి సీసీ రోడ్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, జగనన్న ఇంటి స్థలాలను అందజేశారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్, తాగునీటి ట్యాంకు కూడా నిర్మించారు.



గోడు వెళ్లబోసుకుంటున్న గ్రామస్తులు

సమస్య మొదలైంది ఎక్కడంటే..

ఆ గ్రామస్తుడు ఒకరు నెల క్రితం తన ఇంటి ముందు వర్షపునీరు నిలిచిపోతున్న గుంటను పూడ్చేందుకు సమీపంలో కొంతమట్టిని తవ్వి తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు, ఆ భూమి తమదంటూ ఆ వ్యక్తికి జరిమానా విధించారు. అప్పుడు అటవీ అధికారులు గ్రామాంలోకి వచ్చి, గ్రామంలో కొత్తగా ఎటువంటి నిర్మాణాలు నిర్మించకూడదని ఆదేశించి వెళ్లిపోయారు. ఈ నెల 13వ తేదీన అటవీశాఖ డీఆర్వో ఆనందరెడ్డి, రెవెన్యూ అధికారులు ఆ 105 ఎకరాల భూమిని వేర్వేరుగా సర్వే చేపట్టారు. ఆ సందర్భంగా డీఆర్వో గ్రామస్తులతో మాట్లాడుతూ అటవీ శాఖా వద్దనున్న రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 135లో ఉన్న మొత్తం భూమి 1856లోనే అటవీశాఖకు బదలాయించారని తెలిపారు. కావున మట్టి తవ్వకాలు, తరలింపు పనులు చేయకూడదని సూచించారు. ఆ తరువాత రెవెన్యూ అధికారులు వచ్చి 1922 సర్వే ప్రకారం గయ్యాలి పోరంబోకుగానే మా రికార్డుల్లో ఉందని చెప్పారు. సర్వే అనంతరం అటవీ అధికారులు వారికి సంబంధించిన భూముల మధ్యలో అక్కడక్కడ రాళ్లను నాటేసి వెళ్లిపోయారు. ఇరు శాఖల అధికారుల వాదనలు విన్న గ్రామస్తులు ఏమి చేయాలో తెలియక అయోమయంలోనే గడుపుతున్నారు.

50 ఏళ్లుగా ఇక్కడే ఉన్నాం



మా తాతల కాలం నాటి నుంచి ఇక్కడే నివసిస్తున్నాం. సుమారు 70 ఇండ్లకు పైగా ఉన్నాయి. గ్రామానికి సచివాలయాలు, పాఠశాలలు, సబ్‌స్టేషన్లు వచ్చాయి. తాగడానికి ఉచితంగా మంచి నీటి ట్యాంకును ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు అటవీ అధికారులు వచ్చి వారికి సొంతమంటూ చెబుతున్నారు. జిల్లా అధికారులు మాకు న్యాయం చేయాలి.

– మహేంద్ర, ముద్దురామాపురం, యాదమరి

ప్రభుత్వమే పట్టాలిచ్చింది



ప్రభుత్వం 1983లో మాకు ఇక్కడ ఇంటి స్థలాలను కేటాయించి, పట్టాలను అందజేసింది. అప్పటి నుంచి ఒక్కొక్కటిగా మా గ్రామంలో అన్ని వసతులను ప్రభుత్వాలు సమకూరుస్తూ వస్తున్నాయి. గత ప్రభుత్వంలోనూ ప్రతి వీధికి సీసీ రోడ్లను మంజూరు చేసి నిర్మాణ పనులను అధికారులే పూర్తి చేశారు. ఇప్పుడొచ్చి అధికారులు ఏవో మాట్లాడుతున్నారు.

– దయానందరెడ్డి, సర్పంచ్ భర్త, ముద్దరామాపురం

మేము ఎక్కడికి పోవాలి



ఎన్నో ఏండ్లుగా ఇక్కడే ఉన్నాం. ఇప్పుడు ఆ ఆఫీసర్లు వచ్చి ఈ స్థలం మీది కాదంటే పోండి అంటే మేము ఎక్కడికి పోవాలి. మూడు తరాలు ఈ ఇంట్లోనే జీవనం సాగించాము. మేమే ఆ ఎత్తు తగ్గులుగా ఉన్న భూములను లెవల్ చేసుకొని ఇండ్లను నిర్మించుకున్నాం. మేము ఎక్కడికీ పోము, ఇక్కడే ఉంటాం. జిల్లా కలెక్టర్ సారు వచ్చి మాకు న్యాయం చేయాలి.

– రాణెమ్మ, ముద్దురామాపురం, యాదమరి

ఆ భూములు రెవెన్యూ శాఖవే



ముద్దరామాపురంలోని 135 సర్వేనెంబర్‌లో గల భూములు మొత్తం రెవెన్యూ శాఖ కిందకి వస్తాయి. మా వద్ద పక్కా రికార్డులో విలేజ్ మ్యాప్, ఎఫ్ఎంబీలలో రెవెన్యూకు సంబంధించినట్లు అప్పట్లో అధికారులు పొందుపరిచారు. కావున ఆ భూములు అటవీశాఖకు చెందినవి కావు. దీనిపై తాజాగా సర్వే చేసి పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు తెలియపరిచాం.

– పార్థసారథి, తహసీల్దార్, యాదమరి

బ్రిటిష్ వాళ్లే ఇచ్చారు



1856లో బ్రిటిష్ వాళ్లు ఆ భూములు అటవీ శాఖకే చెందుతాయని గెజిట్ ఇచ్చారు. ఆ గెజిట్ ప్రకారం మేము మా సిబ్బందితో కలిసి గ్రామంలో సర్వే చేశాం. 135 సర్వేనంబర్‌లోని 105 ఎకరాలు అటవీశాఖకు చెందుతాయని ఇటీవల మేం చేసిన సర్వేలో తేలింది. గ్రామస్తులందరికీ మా రికార్డులను పూర్తిగా చూపించాం. ఆ రికార్డులను ఉన్నతాధికారులకు పంపించాం.

– సుకుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, చిత్తూరు

సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ..?



మీడియాతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి చంద్రబాబూ.. అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ప్రశ్నించారు. ఆయన ఆదివారం పాలసముద్రంలో విలేకరులతో మాట్లాడారు. ''ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. నాకు ఓటేయండి మీకు ఉజ్వల భవిష్యత్ చూపుతా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు రెండింతలు ఇస్తానంటూ హడావుడి చేశారు. అధికారంలో వచ్చాక హామీలన్నీ పక్కనపెట్టి వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెడుతున్నారు. హామీలను ప్రశ్నించిన సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారు. అయినా ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పార్టీకి అండగా నిలుస్తుందని తెలిపారు.'' అంటూ ఆయన దుయ్యబట్టారు.

గోకులంలో గోవులేవి?

కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరు చేస్తున్న గోకులం షెడ్‌లలో పాడిపశువులు లేకపోయినా సరే టీడీపీ టీడీపీ నాయకుల పేరుతో గోకులం షెడ్ బిల్లులు మంజూరు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని నారాయణ స్వామి వెల్లడించారు. అందుకోసం బిల్లుల మీద సంతకం పెట్టాలంటూ సర్పంచ్‌లను బెదిరిస్తున్నారని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్‌స్టెంట్లను తొలగించి టీడీపీ నాయకులను ఫీల్డ్‌అస్టెంట్లుగా నియమించుకుంటున్నారని వివరించారు. దీంతో పాటు గ్రామాల్లో ఎక్కడ చూసినా నాటుసారా తయారీ, విక్రయాలను టీడీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైఎస్ ఎంపీపీ పుష్ప ప్రకాష్, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ లిల్లీఆనందన్, గాలి మహేష్ బాబు, అయ్యప్ప, అనురేఖ, పుత్తూరు కేశవరెడ్డి, మనోహర్, చిన్నబ్బరాజు, షణ్ముగరెడ్డి, కుట్టి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభాధ్యక్షులు ఎంపీపీనా..సర్పంచా?

- ప్రొటోకాల్ ప్రకారం సాగని మండల సభ
- ప్రధాన సమస్యలను ప్రస్తావించని సభ్యులు
- ఒక సీఐ, ఇద్దరు ఏఎస్ఐలతో బందోబస్తు



వేదికపై నుంచి మాట్లాడుతున్న సర్పంచ్ ప్రకాష్

బంగారుపాళెం: ఆయన గ్రామ పంచాయతీ సర్పంచ్. ఆయనే మండలాధికారులకు మార్గనిర్దేశం చేశారు. మండల సభలో వేదిక్పై కూర్చుని ఆదేశాలు జారీ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం సర్వసభ సమావేశ వేదిక్పై ఎవరు ఉండాలి? ఎవరు ఉండకూడదనే విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోలేదు.. ఇదీ బంగారుపాళెంలో ఆదివా రం జరిగిన మండల సర్వసభ సమావేశం తీరు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌తో పాటుగా మండలంలోని 170 గొల్లపల్లె సర్పంచ్ ప్రకాష్ వేదిక్పై కూర్చున్నారు. సభలో అజెండా ప్రకారం వివిధ అంశాలకు సంబంధించి అధికారులతో సమీక్ష మొదలైంది. వేదిక్పై ఉన్న సర్పంచ్ ప్రకాష్ కలగజేసుకుని సభలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. దీంతో సభలోని సభ్యులందరూ ఆశ్చర్యపోయారు. ఈయన సర్పంచ్ కదా మండల సభా వేదిక్పై నుంచి సూచనలు, సలహాలు ఇవ్వడం ఏమిటి? అంటూ దిక్కులు చూస్తూ కూర్చున్నారు. ఈ సమావేశ వేదిక్పై కూర్చునే అర్హత ఆయనకుందా అంటూ చర్చించుకున్నారు. దీంతో అసలు ఇది మండల సర్వసభ్య సమావేశమేనా కాదా అనే సంశయంలో ఉండి, సమస్యలను అసలు ప్రస్తావించకపోవడం గమనార్హం.

అధికార దర్పంతో..

మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, మెజారిటీ ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీ వాళ్లే ఉన్నారు. టీడీపీకి సంబంధించి ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే ఉన్నారు. సమావేశానికి వచ్చిన ఇద్దరు టీడీపీ ఎంపీటీసీ సభ్యులు మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. అయితే మండల సర్వసభ సమావేశానికి చరిత్రలో లేని విధంగా ఓ సీఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సభలో ఏదో జరగబోతోందన్న సంకేతాలను సభ్యులకు పంపించారు. ఫలితంగా సభ్యులందరూ సభను నిశతంగా గమనిస్తూ ఉండిపోయారు. అయితే ఏ మాత్రం అర్హత లేని ప్రకాష్‌ను ఎవరైనా సభ్యులు సర్పంచ్ ప్రకాష్‌ను ప్రశ్నిస్తే అధికార బలం ఉపయోగించి పోలీసుల ద్వారా వారిని అడ్డుకోవాలని కుట్రపన్నారన్న చర్చ సాగుతోంది. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశం ప్రజాసమస్యలను గాలికి వదలి అధికార దర్పాన్ని ప్రదర్శించేలా సాగడం గమనార్హం. కొంతమంది అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశం తూతూమంత్రంగానే ముగిసింది.

గతంలో ప్రకాష్ హైడ్రామా..

గ్రామ పంచాయతీల నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ గతంలో ప్రకాష్ భిక్షగాడి అవతారమెత్తి మండల సర్వసభ సమావేశంలోకి వెళ్లి రాద్ధాంతం చేశాడు. దీంతో అప్పట్లో పోలీసులు ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సర్వసభ్య సమావేశంలో అధిక మెజారిటీ కలిగిన సభ్యులు ఎక్కడ ప్రశ్నించి, అడ్డుతగులుత్యేమో అని ఇలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఉండచ్చని సభ్యులు అభిప్రాయపడ్డారు.

స్నాచింగ్ ముఠాలకు సంకెళ్లు

- 401 గ్రాముల నగలు, 4 బైక్‌లు స్వాధీనం
- రెండు కేసుల్లో ఎనిమిది మంది అరెస్ట్
- బాధితులకు నగల అందజేత
- పోలీసులకు రివార్డులు అందజేసిన ఎస్పీ



పట్టుబడిన నగలను, నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పలమనేరు: రోడ్డుపై ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలోని బంగారు నగలను చోరీ చేసే రెండు చైన్ స్నాచింగ్ ముఠాలకు పోలీసులు సంకెళ్లు వేశారు. వీరినుంచి 401 గ్రాముల బంగారు ఆభరణాలు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.32.24 లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఇందుకు కారకులైన ఎనిమిది మందిని ఆదివారం పుంగనూరు, చౌడేపల్లె ప్రాంతాల్లో పట్టుకుని, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలను పలమనేరులోని డీఎస్పీ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు వెల్లడించారు.

ఆరితేరిన ముఠా ఇది

కొన్ని నెలలుగా చౌడేపల్లె, గంగవరం, ముదివేడు, రామసముద్రం, పలమనేరు, రాళ్లబూదుగూరు, బైరెడ్డిపల్లి మండలాల్లో మహిళల మెడలోని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌లపై వచ్చి లాక్కెళ్లిపోతున్నారు. దీనిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదవడంతో చౌడేపల్లి సీఐ రాంభూపాల్, ఐడీ పార్టీ కలిసి నిందితులను పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), రాసూరి హరిక్రిష్ణ(24), మదనపల్లెకు చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ(38), ఎల్ భాస్కర్(37), పవన్‌కుమార్(27), బి.కొత్తకోటకు చెందిన కార్పెంటర్ బావాజాన్(35), చౌడేపల్లెకు చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30)ని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 332 గ్రాముల బంగారు ఆభరణాలు, చోరీలకు వినియోగించిన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.25.74 లక్షలుగా ఉంటుందని చెప్పారు. వీరు వినియోగించిన బైక్‌లు సైతం గతంలో బెంగళూరులో చోరీ చేసినట్టు తేలింది. వీరు నాలుగేళ్లుగా ఇదేరకం చోరీలు చేస్తున్నా ఇప్పటిదాకా ఏ పోలీస్‌స్టేషన్‌లోనూ వివరాలు లేవు. వీరు పట్టుబడడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. వీరిలో ప్రధాన ముద్దాయి అయిన చంద్రశేఖర్ బైక్ వెనుక కూర్చుని మహిళల మెడల్లో ఆభరణాలు లాగడంలో సిద్ధహస్తుడని ఎస్పీ తెలిపారు.

ఆన్‌లైన్ యాప్‌లో అప్పులు చేసి..

పుంగనూరుకు చెందిన బుక్యప్రసాద్ నాయక్ అక్కడి ఆర్టీసీ డిపోలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసేవాడు. ఆన్‌లైన్ అప్పులను ఎక్కువగా చేసి వాటిని కట్టలేక ఇలా చైన్ స్నాచింగ్‌లకు అలవాటు పట్టాడు. ఇతను మూడు కేసులకు సంబంధించి 69 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. దీంతో నిందితున్ని అరెస్ట్ చేసి, చోరీ అయిన బంగారు నగలతోపాటు బైక్ (మొత్తం విలువ రూ.6.5 లక్షల)ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీదు ఈ రెండు కేసులకు సంబంధించి రూ.32.24 లక్షలు విలువైన 401 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

చోరీ ఆభరణాలు అక్కడికక్కడే పంపిణీ

కేసులు లేకుండా చోరీలకు గురైన బైరెడ్డిపల్లె మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేలమ్మకు ఎస్పీ బంగారు గొలుసును అందజేశారు. తాను చిల్లర దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి నీళ్లబాటిల్ అడిగారని దాన్ని ఇచ్చేలోపు మెడలోని చైన్‌ను తెంపుకెళ్లారని తెలిపింది. ఈమెతో పాటు మరికొందరికి ఆయన బంగారు ఆభరణాలను అప్పగించారు.

మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

శ్రావణమాసంలో ఆలయాలకు ఒంటరిగా వెళ్ళే మహిళలు నగలను ధరించకుండా ఉండాలని ఎస్పీ సూచించారు. సాధ్యమైనంత వరకు ఒంటరిగా వెళ్లరాదన్నారు. జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశామని చెప్పారు. గతంలో జరిమానాగా రూ.2 లక్షలు వసూలు చేయగా ఈ నెలలోనే రూ.14లక్షలు జరిమానా వేశామన్నారు. దీంతోపాటు జిల్లాలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు, దుకాణాలు, వీధుల్లో సాధ్యమైనంత ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, పలమనేరు సీఐ నరసింహరాజు, గంగవరం సీఐలు మురళీమోహన్, ప్రసాద్, పుంగనూరు సీఐ శ్రీనివాసులు, చౌడేపల్లె సీఐ రాంభూపాల్, ఎస్ఐ స్వర్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

కేసుల ఛేదించినందుకు రివార్డులు

ఈ కేసుల ఛేదనలో మంచి ప్రతిభ చూపిన సీఐలు రాంభూపాల్, శ్రీనివాసులు, ఐడీ పార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు, అల్లాఉద్దీన్, శశి, బాలాజీ, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పకు ఎస్పీ రివార్డులు అందజేసి వారిని అభినందించారు.





ఐడీపార్టీ సిబ్బందికి క్యాష్ రివార్డులను అందిస్తున్న ఎస్పీ మణికంఠ, అలివేలమ్మకు నగను అందిస్తున్న ఎస్పీ